# తిరోగామి

## చాగంటి తులసి

"రచన ఇంకా రాలేదేవిటి?" గట్టిగా పైకి అనబోయి లోపల అనుకున్నాను. నాలుగు నిమిషాలు కూడా కాలేదు— 'రచన రాలేదేవిటి' అని నేననిన !! మళ్ళీ అనటానికి నోటివరకూ వచ్చిన మాటని మధ్యలోనే ఆపేశాను.

నిమిష నిమిషానికి నాలో ఆదుర్దా ఎక్కువవుతోంది. అయినా నా ఆదుర్దాని లోలోపల అణుచుకుంటున్నాను.

> 'నా మనస్సులో భావాల్ని నేను చిత్రతో అనలేదు. నా ఆలోచనా విధానంలో వస్తున్న మార్పును గుర్తించి చిత్రా యాగీచెయ్యదూ? తేలు కుట్టిన దొంగలాగా నన్ను నాలోనే దాచుకుంటున్నాను."



చిత్ర హాయిగా టేబిలు దగ్గర కూచుని నాలుగు న్యూస్‌పేపర కటింగ్సు చూస్తూ తాను రాయబోయే ఆర్టికల్‌కోసం నోట్ చేసుకుంటోంది. తన పనిలో తాను మునిగిపోయి వుంది. ఈ వారం పత్రికకి తాను పంపవలసిన ఫీచరుకి కావలసిన సామగ్రిని తయారుచేసుకుంటోంది. వారం వారం చిత్ర రాసే ఆ ఫీచరు ఆడవాళ్ళ కోసమే అయినా పత్రిక మార్కెట్‌లోకి వచ్చీరాగానే మొగాళ్ళంతా మొదట చిత్రా పేజీనే చదువుతారు! నా ఆదుర్దాతో నిశ్చింతగా వున్న చిత్రని డిస్టర్బ్ చెయ్యడం తగనిపని! అందులోనూ ఆవిడ సీరియస్‌గా రాసుకుంటున్నప్పుడు!

నిముషానికో సిగరెట్టు చొప్పున పది సిగరెట్లు కాల్చేను. మాగజేను తిరగేసేను. చదవడం మాట దేవుడెరుగు బొమ్మల్ని కూడా సరిగ్గా చూడలేకపోయాను. మనస్సు నిలవటంలేదు. రచన రాలేదు. రచన ఇంకా రాలేదు. అప్పుడే ఎనిమిదైపోయింది. శీతాకాలం రాత్రి, చిక్కటి చీకటి. చలితో చిక్కబడ్డ చీకటి. నాలుగు నిమిషాల క్రితం నన్ను నేను అదుపులో పెట్టుకోలేని ఆదుర్దాతో "చిత్రా! రచన ఇంకా రాలేదేవిటీ" అని అంటే న్యూస్‌పేపరు లోంచి మొహం ఎత్తి, "భోంచేద్దామా? అదెలాగా నానా గడ్డి తినే వస్తుంది. దానికోసం మనం కూర్చోవడం ఎందుకూ?" అన్నది.

నేను భోజనంకోసం అడిగేనని అనుకుందేకాని నా ఆదుర్దా చిత్రకి తెలియేలేదు. చిత్రం!!

"అబ్బే! నాకు ఆకలి వెయ్యటంలేదు" అన్నాను.

"కూతురు రాందే కూడు నోటికిపోదు!" అని కూడుని నొక్కి వెక్కిరిస్తూ నవ్వింది చిత్ర.

నేనూ నవ్వేను. కూతురు మీద తండ్రికి ఎక్కువ ప్రేమ వుండడం మామూలైన సంగతే! రచన అంటే నాకు ఒల్లమాలిన ప్రేమ అని చిత్ర చీటికీ మాటికీ వెక్కిరిస్తూ వుంటుంది. "నీకు రవిగాడంటే అభిమానం" అని మాటకి మాటా నేనూ అంటాను. తల్లికి కొడుకంటే ప్రాణం అన్నమాట పదహారణాల నిజమే! అయితే చిత్ర విషయంలో అది పూర్తి సత్యం కాదు. చిత్రకి రవికన్నా రచనంటేనే ఎక్కువ ఆపేక్ష ఉన్నట్టు ప్రతి చిన్న

విషయ లోనూ కనపడుతూ ఉంటుంది. ప్రతి నియమానికీ కొన్ని మినహాయింపులు ఉంటాయి. లేకపోతే అది నియమంకాదు. రవిని నేనూ తిడతాను. చిత్రా తిడుతుంది. తిట్టడం తప్పని నాకూ తెలుసు. చిత్రకీ తెలుసు అయినా తిడుతూనే ఉంటాం.

"రవీ రాలేదే!" అన్నాను.

"వాడా? ఆ భజనకి పోయి ఉంటాడు. వారం వారం భజనకి పోతున్నాడు. వాణ్ని గాటి నుంచి ఎలాగైనా తప్పించాలి." చిత్ర మాటల్లో ఎంతో బెంగ కనపడ్డాది.

వెధవాయికి ఎంత చెప్పినా లాభంలేక పోతోంది!

మా సావిడి గోడలు అభ్యుదయ భావాలని ప్రతిధ్వనిస్తూ వుంటాయి. ఆ గోడల మధ్యకి ఓసారి వచ్చి ఓ ఐదు నిమిషాలు మా కుర్చీల్లో కూర్చుని వెళ్ళిన ప్రతి ఒక్కరూ మళ్ళీ మళ్ళీ మా ఇంటికి రావాలనే అనుకుంటారు. మా సావిట్లో చర్చకి రాని విషయమంటూ ఉండదు ఊళ్లోఉన్న మేధావులందరూ మా మిత్రులే. కొందరు నా మిత్రులైతే మరికొందరు చిత్రా మిత్రులు. కొందరు, మరికొందరు వెరసి

## ఔను నిజం

ప్రపంచంలో కెల్ల లెనిన్ రచనలు బైబిల్‌తో సమానంగా అమ్ముతున్నాయి పుస్తక ప్రపంచంలో. బైబిల్ 286 ప్రపంచ భాషలలోకి అనువాదం కాగా లెనిన్ గారివి యిప్పటికి 201 భాషలలోనికి వెళ్ళాయి.

మా యిద్దరి మిత్రులు. ఆడా మగా చిన్నా పెదా అన్నిరకాలవాళ్ళు, వయస్సు మళ్ళిన వాళ్ళు, వయస్సు వసున్నవాళ్ళు అందరూ వస్తారు. పిచ్చాపాటీకాదు, గంభీరమైన విషయాలే మాటాడుకుంటాం. మా సావిట్లో కళాకారులు– రచయితలు, చిత్రకారులు, సంగీతజ్ఞులు, డాక్టర్లు, లాయర్లు, కాలేజీ మాస్టరు- అన్ని రకాల వాళ్ళం జ్ఞాన సంచితాన్ని పిండితార్థంగా చేసి సంఘ జీవితాన్ని అవగాహన చేసుకుని దేశాన్ని సంఘాన్ని తీర్చిదిద్దాలని భవిష్యత్తు బంగారపు కలలు కంటాం. మా సావిట్లో కూచుని ఆ కలలని నిజాలు చెయ్యాలని కల్లలు కాకుండా చూడాలని అనుకుంటాం. రచనా రవీ ఆ గోడల మధ్య పుట్టి పెరుగుతున్న వాళ్లు! అయినా ఇద్దరికీ ఎంతో తేడా కొట్టొచ్చినట్టు కనపడుతోంది. అందులో ఈ మధ్య రవి అలా తయారయేడు. చిన్నవాడు-అలా ఇంకా ఎదగాల్సివుంది. అయితే ఈ చిన్న వయస్సులో "సరియైన గాలివాటం"లో నడవకపోతే పాడై పోడూ? చిత్రకి అదే భయం! బెంగ! చింత!!

ఆవేళ ఇంత విభూతి నుదుటిని పూసుకుని కొబ్బరికాయ చెక్క- చెక్కలో నాగమల్లిపువ్వూ, సింధూరం పొట్లాంతో వాడు ఇంటికి వచ్చేసరికి చిత్రా నేనూ మొహ మొహాలు చూసుకున్నాం. మా ఇంట్లో దేవుడులేడు!

మేం వాణ్నేమీ అనలేదు. అన్నిరకాల భావాలకి కిటికీలు తెరిచి ఉంచాలి. రెక్కలు కత్తిరించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, పంజరాలు మాకు కిట్టవు. చర్చించడానికి, వాదించడానికి, అంగీకరింప చెయ్యటానికి తర్కం, నిశిత బుద్ధి, జ్ఞానం, అనుభవం అన్నీ వున్నాయి. అడ్డుకట్టలు, ఆనకట్టలు అనవసరం. మంచీ చెడ్డా పురోగమించడమంటే ఏమిటో, తిరోగమించడమంటే ఏమిటో వాడికి వాడే తెలుసుకోవాలి. వాడికి వాడి స్కూల్లో జతపడ్డ స్నేహితుడి పిచ్చిలో వాడికీ వెర్రి పట్టుకుంది. ఇప్పుడు భజనకి కూడా వెళ్తున్నాడు.


రవి మాట ఎత్తేసరికి చిత్ర మొహంలో చింత కనిపించింది. మా శిక్షణ అంతా బూడిదలో పోసిన పన్నీరవుతూ వుంటే మా వాడే మా చేతుల్లోంచి జారిపోతూ వుంటే బెంగకాదూ!!

మళ్ళీ సిగరెట్టు ముట్టించేను. ఏపనీ చెయ్యాలనిలేదు. మిత్రులెవరూ రాలేదు. సిగరెట్టు పొగ మీదకి వదులుతూ ఆ రింగు రింగు పొగల మధ్య ఎదురుగావున్న గోడ వేపు చూసేను. చిత్ర పిల్లలిద్దరి ఫోటోలు ఎన్‌లార్జ్ చేయించి రెండు పుస్తకాల అలమరాల మీదా రెండు ఫోటోలు పెట్టింది. పిలల ఫోటోలు, అంకెలూ ఉన్న ఓ కేలండరు తప్ప ఇంకే అలంకారం గోడలకి లేదు. చిత్ర అభిరుచులే అంత!

రచన ఫోటోవేపు చూడగానే 'రచన రాలేదేమిటి?' అని మళ్ళీ లోపల అనుకోకుండా ఉండలేకపోయాను చేతి వాచీవేపు చూశాను. ఎనిమిది దాటిపోయింది. చిత్ర నిశ్చింతగా రాసుకుంటోంది. రచన ఇంకా రాలేదన్న ధ్యాసే ఆవిడకి లేదు!

నిన్న సాయంత్రం రచన పరుగు పరుగున వచ్చింది. బెల్‌బాటమ్స్‌లో మెడ వరకూ వున్న ఉంగరాల పొట్టి జుట్టు

ప్రియ కార్టూన్



ఎగురుతూ వుంటే చూడముచ్చటగా స్మార్ట్‌గా వుంది. దానివెంట ఓ కుర్రాడూ వున్నాడు. దానిమీద ఓ బెత్తెడు పొడుగున్నాడు. వాడూ బెల్ బాటమ్స్ వేసుకున్నాడు. వాడి జుట్టూ వుంగరాల జుట్టే! గుండ్రని మొహానికి సరదా కళ్ళజోడు పెటుకున్నాడు. ఇద్దరూ చెయ్యీ చెయ్యీ పట్టుకుని పరిగెడుతూ వచ్చేరు. కిటికీ దగ్గర నిలబడ్డ నన్ను చూసి వాళ్ళిద్దరూ ఏం బెదిరిపోలేదు. అతి మామూలుగా ఇదరు ఆడపిల్లలు చెట్టాపట్టా లేసుకుని పరిగెట్టుకు వచ్చినట్టుగా వచ్చేరు. ఓ లిప్తపాటు నేనే గతుక్కుమని నన్ను నేను సర్దుకున్నాను.

"అమ్మా!" రచన పరుగుతో వచ్చిన ఆయాసంతో కేకేసింది.

"అమ్మలేదు. వంటింట్లో ఫిల్టరులో డికాషన్ ఉంది. కాఫీ కలుపుకుని తెచ్చుకో" అన్నాను.

రచన పక్కనే ఆ కుర్రాడు నిల్చుని నన్నూ మా సావిడినీ చూస్తున్నాడు. నేనా కుర్రాణ్ణి ఇదివరకు చూడలేదు.

"అబ్బే కాఫీ అక్కర్లేదు. నాకు ఓ ఇరవై రూపాయలు కావాలి."

"ఎందుకుట ఇరవై రూపాయలు!"

"మేం అంతా పిక్‌నిక్‌కి వెళుతున్నాం. తలో ఇరవై వేసుకోవాలనుకున్నాం. ఈ అబ్బాయి రాజు- మా పైక్లాసు. మా క్లాసు వాళ్ళూ వాళ్ళ క్లాసు వాళ్ళూ కలిసి వెళ్తున్నాం."

ఆ రాజు నాకు నమస్కారం చేశాడు.

"అమ్మకి చెప్పేవా?"

"అమ్మ ఎప్పుడూ వద్దనదు. నాకు తెల్సు. మిగతా అమ్మాయిలు తటపటాయించేరు కాని, నేను వెంటనే నా పేరు ఇచ్చేసేను. అమ్మ వద్దని ఎందుకంటుంది? పైగా వెళ్ళకపోతేనే తిడుతుంది. ఇరవై రూపాయలు ఇయ్యి నాన్నా!" అన్నది రచన.

రచనవేపూ, ఆ కుర్రాడివేపూ ఓ సారి చూసేను. ఓ లిప్తపాటు ఆలోచనలో పడ్డాను. జేబులోంచి ఇరవై రూపాయలు తీసి యిచ్చేను. వాళ్ళిద్దరూ మళ్ళీ బయల్దేరేరు మిగిలినవాళ్ళదగ్గర డబ్బులు వసూలు చెయ్యడానికీ, పిక్‌నిక్ ఏర్పాట్లు చూసుకోడానికీ!

ఇవాళ పొద్దున తెల్లారకుండా చీకటితోనే రచనా వాళ్ళూ పిక్‌నిక్‌కి వెళ్ళేరు. రోజు రోజంతా తిరిగినా ఈపాటికి ఇంటికి రావాలి. రాత్రి ఎనిమిది దాటిపోయింది. అయినా రాలేదు.

రచన ఆ ఫొటోలో ఎంత అందంగా ఉంది. నా కళ్ళముందే నా కూతురు ఇంత దల్లా అంతదైపోయింది. ఆకర్షణీయమైన కళ్లు- ఒంకులజుట్టు- అచ్చు చెల్లాయే! మేనత్తపోలిక! వద్దనుకున్నా మేనత్త, మేనమామల పోలికలు పిల్లలకి వచ్చిపడతాయి. చెల్లాయి నలుపు. నలుపైనా చక్కటిది. రచనకి చల్లాయి చక్కదనం, చిత్రా రంగు వచ్చేయి. పచ్చటి పసిమి ఛాయ. రచన ఈడుకి చెల్లాయి ఎలా వుండేది? రూపు ఒక్కటే ముఖ్యంకాదు. రూపుతో ఎన్నో వుంటేనే కాని వ్యక్తిత్వం భాసించదు. రచన ఎక్కడ! చెల్లాయి ఎక్కడ! చెల్లాయి చీర చుట్టపెట్టుకునేది! ముడుచుకుపోయి లేని గూని తెచ్చుకుని తల దించుకుని భయంభయంగా, బితుకు బితుకుగా వుండేది. నలుగురిలోకి వెళ్ళడం దానికి రానూరాదు. ఇంట్లో వాళ్ళు వెళ్ళనిచ్చేవారూ కాదు. తెల్లటి మల్లెపువ్వులాంటి స్పోర్ట్స్ డ్రస్‌లో చేతిలో బేటుతో వుంగరాల జుట్టుతో నాకేమిటి అన్నవిశ్వాసంతో తల మీదకి ఎగరేసిన పొగరూ గర్వంతో రచన!! ఆ ఫొటోలో కళ్ళూ మొహం అచ్చు చెల్లాయిలా వున్నా రచన రచనే!!



ప్రథమ శ్రేణిలో పాస్ తండి
మంచి శిక్షణకు
పేరెన్నికగన్న ఏకైక సంస్థ
**TWIN CITIES TUTORIALS**
**Y. M. C. A. Narayanaguda, HYDERABAD—29**
S. S. C. INTER (year-wise)
మెడికల్ & ఇంజినీరింగ్ ఎంట్రెన్స్ పరీక్షలకు శిక్షణ ఇవ్వబడును.
వివరాలకు సంప్రదించండి.

ఉచితం ఉచితం ఉచితం
**తెల్ల మచ్చలు**
ఏ రకం తెల్లమచ్చలనైనా సరే వాని రంగు మరియు స్వరమచ్చలరంగు మ్యాప్రఖ్యాత ఔషధం "డ్రాగ్ వినాశక్" వాడిన మెదల మూడు దినములలో మారును. ఆటుపైన మామూలు చర్మం వలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
GAUTAM CHIKITSALAYA (S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

"జ్యోతిచిత్ర"
చదివి ఆనందించండి!

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బల హీనత, శీఘ్ర స్కలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్
టి. వి. రోడ్. తెనాలి. ఫోన్ : 700, 1010.

SUVARNA

చెల్లాయి నాతోపాటు వచ్చేసే బాగుండేది! నిశితమైన బుద్ధి, పదునైన ఆలోచనా మని షికి అందాన్నిస్తాయి. చెల్లాయి మాదగ్గర వుంటే చాకులా తయారయేది! అది నాతో ఎలా వస్తుంది? ఇంట్లోవాళ్ళంతా నన్ను వెలివేశారు. వాళ్ళు వెలివెయ్యడంకాదు. నేనే వాళ్ళని వదిలి వచ్చేశాను.

తప్పుబట్టేను అన్నారు. చెడబుట్టేను అన్నారు 'ఛీఛీ వాడు చచ్చేడని అను కుంటాం' అన్నారు. ఆ రోజులూ అలాం టివే. మావాళ్ల ఆలోచనా తీరూ అలాంటిదే. కులంతక్కువ పిల్లని కట్టుకుంటానంటే వాళ్ళు ఎలా భరించగలరు? కట్న కానుక లతో వచ్చే కతిని కట్టబెడదామను కున్నారు! మొగుడులేని మెతకదానితో బత కాలన్నారు. ఆడదానికి మెదడు అక్కర్లే దన్నారు!

వాళ్ళ మాట వినకపోగానే నేనో పనికి మాలిన వెధవనయిపోయాను. చిత్రాంగి చేతుల్లో చిత్తయిపోయిన చేతకాని వెధవ నయిపోయాను. నన్ను తిట్టడం మానేసేరు. అందరూ చిత్రాని దుమ్మెత్తిపోశారు.

"అదే వాణ్ణి తగలేసింది! అది ఆడదా! మొగాడికి మొగుడు!" అన్నారు. నిజమే! ఆ రోజుల్లోనే చిత్రా పవిట కప్పుకోకుండా రెండుచేతులూ ఆడిస్తూ మగరాయుడిలా నడిచేది. నిర్భయంగా ఆడవాళ్ళనీ, మగ వాళ్ళని తేడా లేకుండా తిరిగేది. ఆడవాళ్ళ కంపెనీకన్నా మగవాళ్ళ కంపెనీనే తనకి ఎక్కువ ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ యిచ్చేది. ఆడవాళ్ళతో మాటాడ్డానికి ఆవి డకేం మాటలు కనిపించవికావు. తాను ఒక ఆడదాన్నన్నట్టుగా ఆవిడెపుడూ ప్రవర్తిం చేది కాదు. ఆవిడ వాక్పటిమ, తర్క నైపుణ్యం, నిశితమైన బుద్ధి ఆవిడకో చిత్రమైన చక్కదనాన్ని యిచ్చేవి. ఆవిడ దగ్గర మాట్లాడ్డానికి మగవాళ్ళే హడలి చచ్చేవారు. నాక్కావలిసిన మిత్రురాలు ఆవిడే అని ఆవిడలాంటి మిత్రురాలు దొరికినందుకు ఎంత అదృష్టవంతుణ్ణో అని అనుకున్నానంటే అందులో రవ్వంతైనా ఆశ్చర్యపడాల్సింది ఏంలేదు. పదు నైన మెదడుతోపాటు అతిమెత్తని మనస్సు వున్న అమ్మాయి నాకింకెక్కడదొరుకుతుంది? పెళ్ళి చేసుకున్నాక చిత్రా పైకి మగరా యుడిలా కనపడుతుందేకాని, లోపల మన స్సులో, హృదయాంతరంలో ఎంత అందమైన ఆడదో తెలుసుకున్నాక అంద లమే ఎక్కేను!

వయస్సు మళ్ళుతున్నా చిత్రా ఉత్సాహం, శక్తీ తగ్గలేదు. మగాణ్ణైనా నేనే నీరసపడిపోతున్నాను. ఒక్కొక్కసారి శారీరకంగానూ, మానసికంగానూ వేళాడ పడిపోతున్నాను—నిట్టూర్చి పోతున్నాను. లోపల్నుండి నన్ను పరిగెట్టించే ఉరకలు వేయించే పనిచేయించే శక్తి తగ్గిపోతున్న ట్టుగా ఉంది. చిత్ర నాలో మార్పుని గమ నిస్తోందా? ఏమో! గమనించినట్టు లేదు! గమనిస్తే ఊరుకుంటుందా? ఊరుకోవడం ఆవిడ గుణం కాదు! చిత్రానే గమనించక పోతే నాలోని మార్పుని ఇంకెవరు గుర్తు పట్టగలరు? నాతో పనిచేసే నా కొలీగ్సూ పోల్చలేరు, నా ఇంటికి వచ్చే మిత్రులూ పోల్చలేరు.

చిత్రాకి చెప్పనా? నాలో రేగుతున్న అలజడిని చెప్పనా? చెప్పి చీవాట్లు తిననా?

రచన ఇంకా రాలేదు. ఇంత ఆలస్యం ఎందుకయిందీ? ఆ పిక్నిక్ బస్సు ఏదన్నా ట్రబుల్ ఇచ్చిందేమో! రాత్రి అయిపోయిందే! మధ్యతోవలో ఆగిపోయి నానాపాట్లు పడుతున్నారేమో!

ఆ వేళ రచన మెచ్చటకోసం చిత్రా చీర కట్టుకుంది. జడేసుకోకుండా పెద్ద దానిలా ఆ వొంకీలజుట్టుని ముడివేసుకుంది. దాన్ని చూసి అలా వుండిపోయాను ఇది రచనేనా? నా కూతురేనా? అనుకున్నాను. రచన చిత్రా అంత పొడుగూ అయి పోయింది చూస్తూఉంటే చిత్రాకన్నా పొడుగయేటట్టు ఉంది! రవో? నిండా పద్నాలుగేళ్ళులేవు! నా భుజం వరకూ ఉన్నాడు చిత్రా జుట్టు పండుతోంది ఆవిడ ముడిలో తెల్ల వెంట్రుకలు వెండిలా మెరుస్తూ కనపడుతున్నాయి. నా నుదురు విశాలమై బట్టతలకి దారి చూపుతోంది. నేను పెద్దవాణ్ణైపోతున్నాను. ముసలితనం ముసురుకు వస్తున్నది!

వాచీ చూసేను. పావుతక్కువ తొమ్మిది! రచన ఇంకా రాలేదు!

"చిత్రా! రచన 'కారిగాను' పట్టు కెళ్ళిందా?" అరచేతుల్ని ఒకదానితో ఒకటి రుద్దుకుంటూ అడిగేను ఉన్నట్టుండి అడిగే నేమో చిత్ర వెనక్కి తిరిగి నావేపు చూసింది. కుర్చీలో కాళ్ళు ముడుచుకు కూర్చున్న నన్నూ, నా వళ్ళో పుస్తకాన్నీ చలి తగ్గడానికి అరచేతుల్ని రుద్దుకోవ డాన్ని చూసి చిన్నగా నవ్వింది.

"చలేస్తూ వుంటే స్వెట్టరు వేసుకో కూడదూ? అలా 'ఐడిల్'గా కూర్చు న్నావేం? పనేం లేదా?" అన్నది.

నేనడిగిందొకటీ, ఆవిడ చెప్పిందొక టీనూ! ఇబ్బందిగా ఉన్న నా మొహం వేపు చూసి చిత్రా మళ్ళీ నవ్వింది!

"రచనకి కార్డిగాను పట్టుకెళ్ళమని

నువ్వా. నేనూ చెప్పాలా? అదేం పసిపిల్లా? దాని సంగతి అది చూసుకోగలదు!!" అన్నది.

చిత్ర ఎంత మామూలుగా చెప్పింది! రాత్రి తొమ్మిదయిపోతున్నది. పొద్దున చీకటితోననగా వెళ్ళిన అమ్మాయి ఈసరికి ఇంటికి రావల్సింది. రాలేదు. ఇంత రాత్రప్పుడు ఎలా వస్తుంది? ఎందుకింత వరకూ రాలేదు? ఏమైవుండి వుంటుంది? అసలు పిక్నిక్‌కి పంపడమే పొరపాటేమో! పంపకుండా వుండాల్సిందేమో! పంపితే పంపేం- ఎవరికన్నా అప్పచెప్పవల్సిందేమో! ఈ పిల్లలతోపాటు పెద్దవాళ్ళెవరైనా వెళ్ళేరా? లేకపోతే అందరూ పిల్లలేనా? అన్నీ ప్రశ్నలే! చిత్రకి చింతే లేదు!!

చిత్రా టైం చూసింది. "అబ్బా! అప్పుడే తొమ్మిదయిపోతోందే! ఈ రవిగాడు ఇంకా ఊడిపడలేదు! వాళ్ళింటో ఆ భజన రాత్రి పదిగంటలవరకూ చేస్తారులావుంది! సాయంత్రమనగా పోయినవాడు అక్కడే అతుక్కుపోయినట్టున్నాడు. టెంపేస్తు తగలడుతున్నాడు!" అన్నది చిత్ర.

రవితో ఓరోజు గట్టిగానే తర్కించి, వాదించి వాడి తప్పు ఏమిటో వాడికర్థం అయ్యేటట్టు చెయ్యాలని చూశాం. వాడి తర్కం వాడికీ ఉంది.

"మీరు మహాగొప్పగా మెచ్చుకునే మీ రచయిత 'ర'గారు అక్కడికి వస్తున్నారు—తెల్సా?" వాడు ఎదురు ప్రశ్న వేశాడు.

'ర'గారు భజన మొదలుపెట్టిం దగ్గర్నుంచి చివరివరకూ ఉంటారట! భజన పాటలకి కళ్ళుమూసుకుని తన్మయత్వంతో ఊగిపోతారట!!

ఆ పాటలకి తన్మయత్వం కూడానా? దంపుడు పాటల్లాగ ఒక్కలా ఉంటాయి!

"ర" గారు పెద్దవారు. మన బతుకుల్లోని వైవిధ్యాన్ని పరిశీలించడానికి ఆయన అక్కడికి వెళ్తూ ఉండి ఉండొచ్చు. రకరకాల మనస్తత్వాల మనుషులని అర్థం చేసుకోడానికి అన్ని స్థాయిలోంచి జనాన్ని చూడ్డానికి వెళ్తా వుండొచ్చు. ఆయన వెళ్ళడం వేరు! ఆయన అందరికీ కనువిప్పు కలిగేటటు వీటన్నిటిమీదా ఓ గొప్ప రచన చెయ్యొచ్చు. "ర" గారు ఇలాంటి కొటని- బాబాలని భజనలని వెక్కిరించే "ర" గారు అక్కడికి వెళ్ళే కారణాలు ఇవి కావొచ్చునని చిత్ర రవికి బోధ పట్టి చెప్పింది.

"ర"గారు మారిపోతున్నారేమో! మారిపోయేరేమో! వయస్సు వాలిపోతూఉంటే మొగ్గు వాటిమీదకి పోతోందేమో! నా మన


# శుభ వార్త

ఇప్పుడు లైసెన్సు అవసరంలేదు.

నేషనల్ 2 బ్యాండ్ ట్రాన్సిస్టర్ రూ. 15/- లకే

రూ. 250/-ల విలువగల అధునాతనమైన ప్రపంచ ట్రాన్సిస్టర్ జపాన్ మోడల్ రూ. 165/- అవుతుంది. కాని మీకు రూ. 15/-లకే యివ్వబడుతుంది. ఇంగ్లీషులో ఆర్డరు చేయండి. అడ్వాన్సు అవసరంలేదు.



**FIJI ELECTRONICS (BT-19) C-57, Nirmalpuri, Delhi-24.**



"బాలజ్యోతి" చదివి ఆనందించండి!






SPRINGFIELD AGENCIES (Regd.)
E-32 FATEH NAGAR NEW DELHI-110018

ఆర్డరు ఫారం — ఈరోజే పోస్టు చేయండి

A J P-5

**The Manager**
**Springfield Agencies (Regd.), New Delhi-110018**

**Dear Sir,**
**Please send me One Springfield Supershot-77 Air Rifle on Rs. 20/- per month instalment alongwith all the documents for possession. As per your instalment system, I agree to pay the instalments regularly.**

NAME.............................. AGE.......YEARS
ADDRESS..............................................
P O ................... PIN ☐☐☐☐☐☐ DIST.................
OCCUPATION..................... SIGN.....................

FILL THIS FORM IN ENGLISH IN BLOCK LETTERS
DO NOT SEND ANY ADVANCE WITH THIS ORDER

## పోస్టల్ కోచింగ్ ద్వారా ఉత్తీర్ణులు కండి

1978 లో 8వ తరగతి పాసైనవారు 1981 లో ఇంటర్‌కు అర్హులు. 1977 లో S.S.C. లేక 1978 లో ఇంటర్ పాసైన బి. ఏ./బి. కాం. (ఫైనల్) 1981 కి అర్హులు. బి. ఎ/బి. కాం. ఎం. ఎ/ఎం. కాం. (ఫైనల్)కు పట్టభద్రులు బి.యిడికి అర్హులు. ప్రాస్పెక్టస్‌కై రు. 5/-లు ఎం. ఓ. చేయండి.

**ఉషా ఈవెనింగ్ కాలేజి**

(రిజిష్టర్డు)

1-7-378, బాకారం రోడ్, హైదరాబాద్-48,

H. O : టి. నగర్, మద్రాసు-17.



# కాయకల్ప చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజరు

**శ్రీ యోగాశ్రమ్,**
**పెదవాల్తేరు,**
**విశాఖపట్టణము-17.**


స్సులో భావాల్ని నేను చిత్రతో అనలేదు! 'ర'గారి మాటల వున్నా నా ఆలోచనా విధానాలలో వస్తున్న మార్పును గుర్తించి చిత్రా యాగీ చెయ్యదూ? తేలుకుట్టిన దొంగలాగ నన్ను నేను నాలోనే దాచుకుంటున్నాను.

లేచి లోపలికి వెళ్ళేను. స్వెట్టరు తొడుక్కుని మఫ్లరు తలకి చుట్టుకుని బయల్దేరాను.

"ఇప్పుడెక్కడికి బయల్దేరేవు? న్యూసు వినవా?" అంటూ చిత్రా ప్రశ్నించి ప్రశ్నిసరు పెట్టింది.

"అలా కిళ్ళీకొట్టు వరకూ వెళ్ళివస్తాను. న్యూసు నువ్వు చెబుదువుగాని" అంటూ వీధిలోకి నడిచా.

జేబులో సిగరెట్టు పాకెట్టు వున్నది. అగ్గిపెట్టె వున్నది. కిళ్ళీకొట్టుకి వెళ్ళాల్సిన అవసరం లేనేలేదు. రచన రాలేదని క్షణక్షణానికి ఆదురా పెరిగిపోతూ వుంటే పట్టలేక వీధిలోకి వచ్చేను. మనస్సులోని అలజడిని చిత్రకి చెప్పలేదు. చెబితే విరగబడి నవ్వుతుంది. నా మనస్సుకి పట్టిన బలహీనతని ఆవిడ గుర్తించలేదు. నాలో వచ్చిన మార్పుని ఆవిడ ఇంకా గమనించలేదు.

చిత్రా స్థానంలో వున్న ఏ ఆడదన్నా కంగారుపడదూ? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

చిత్రా మామూలు ఆడవాళ్ళలాంటిది కాదు. సంజెదీపం పెట్టి పుస్తెలు కళ్ళకద్దుకుని మొగుడికోసం దణ్ణంపెట్టే ఆడది కాదు చిత్ర మెళ్ళో పుస్తెలు లేవు. నేను చిత్రాకి పుస్తెలు కట్టలేదు. మాది రిజిస్టర్డ్ మారేజి. రిజిస్టర్డ్ మారేజి చేసుకున్నా మన ఆడవాళ్ళు పుస్తెలూ, నల్లపూసలూ వేసుకుంటారు; మట్టెలూ, నల్లపూసలూ మానేసినా పుస్తెలు మాత్రం ఉండకపోతే తప్పే అనుకుంటారు! చిత్రా పుస్తెలు పెట్టుకోలేదు! ఆవిణ్ణి మెడలో పుస్తెలతో పాత ముత్తైదువ వేషంలో చూడాలని నేనూ అనుకోలేదు! మొగుణ్ణి నువ్వు అంటుంగనీ, మెళ్ళో పుస్తెలన్నా వేసుకోదనీ చిత్రా గురించి విచిత్రంగా చెప్పుకుంటే నాకది గర్వంగానే వుండేది! లోకం మమ్మల్ని చూసి విడ్డూరపడితే నాకు గర్వంగానే వుండేది!

రచన రాలేదనీ, రాత్రి తొమ్మిది దాటిపోయిందనీ నాకు కంగారుగా వున్నది. చిత్రాకి చీమ కుట్టినట్టైనా లేదు. నాకిది విడ్డూరంగా వున్నది!

రచన చిన్న పిల్ల కాదు. పెద్దదైంది. దాన్ని కంటికి రెప్పలా కాపాడాలి. ఏ గాలి వాటుకైనా ఏమన్నా అయితే!

మా వీధిలో మనుష్య సంచారం లేదు. శీతాకాలమేమో ఇళ్ళలో వెచ్చగా కూర్చోడమే బాగుంటుంది రోడ్లంట తిరిగేకన్నా! వీధి కొసని చిత్తు కాగితాలూ, చెత్తా మంట పెట్టుకుని కొంతమంది కూర్చునివున్నారు. ఎర్రటి మంటలో నల్లటి వాళ్ళ మొహాలు ఇనప దిమ్మల్లా కనపడుతున్నాయి. వీధి కుక్కలు రెండు మంటకి దగ్గరగా మోర లెత్తుకుని నిల్చున్నాయి.

మా వీధివేపు ఎక్కడా ఏ బస్సూ ఏ కారూ వచ్చే చడీ చప్పుడూ లేదు.

నాదే తప్పు. రచన డబ్బుకావాలని అడిగినప్పుడే అన్ని వివరాలూ అడగాల్సింది. ఆ కుర్రాణ్ణే అడగాల్సింది. పిక్నిక్ అన్నది. ఇరవై రూపాయలంది. వెంటనే ఏం అడక్కుండా యిచ్చేశాను. ఎన్నిగంటలకి తిరిగి వస్తారనన్నా అడగలేదు. అదివచ్చే టైం తెలిసే నేనన్నా వెళ్ళి తీసుకువచ్చే వాణ్ణి. లేకపోతే రవినైనా పంపేవాణ్ణి. కాలేజీ దగ్గర బయల్దేరి తిరిగి కాలేజీకే వస్తారేమో! కాలేజీ నుంచి అంతా ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్తారేమో! కాలేజీ వరకూ వెళ్ళి వస్తేసరి అనుకున్నాను.

రచన చిత్రాకి చెప్పి వెళ్ళిందేమో! అందుకే ఏ కంగారూ లేకుండా ఆవిడ అంత ధీమాగా వుందేమో! నా మనస్సులో కంగారునీ, నా భయాన్నీ, నా ఆదుర్దానీ చెపితే ఆవిడ నవ్వుతుంది. నన్ను నేను బైట పెట్టుకోలేదు.

అనకూడదుకాని ఈ కాలపు కుర్రాళ్ళు చాలా ఫాస్టు. నా కళ్ళముందు ఆ రాజు-ఆ కళ్ళజోడు కుర్రాడు కనిపించాడు. ఎవరబ్బాయో? ఎలాంటివాడో? వాడితో రచన సన్నిహితంగా వున్నట్టే వున్నది. ఆడపిల్లని మధ్య మధ్యలో కాస 'చెక్'లో పెట్టడం అవసరమే! మంచీ చెడ్డా విచక్షణా జ్ఞానం దానికెక్కడున్నదీ?

రెండు చేతులూ పేంటుజేబుల్లో పెట్టుకుని చకచకా నడుస్తున్నా. స్వెట్టరున్నా, మఫ్లరు మెడచుట్టూ వున్నా లోపల్నుంచి చలి కుదుపుగా వచ్చింది. వెన్నుపూసలోంచి వొణుకుపుట్టింది.

కాలేజీకి వెళ్ళేను. గేటుకి తాళాలు పెట్టి వున్నాయి. దర్వాను గుర్రు బైటికి వినపడుతోంది గూర్ఖావాడు నిద్రపోతున్నాడు! నిద్రపోకుండా కాపలా కాయొద్దూ? ఎవర్ని కేకేసి ఏమిటని అడగడం? గాభరా ఎక్కువైంది. ప్రిన్సిపాల్‌కి ఫోన్ చేసే? ఈ పిల్లలు కాలేజీ తరఫున వెళ్ళేరో వాళ్ళ మానాన్ని వాళ్ళు వెళ్ళేరో? ఇంటి మొహం పట్టేనన్న మాటేగాని నా వొణుకు మరీ యెక్కువైంది.

రోజులు మారిపోయేయి. కాలేజీకుర్రాళ్ళు బుద్ధులు పట్టుకుంటున్నారు. అమ్మాయిలూ అబ్బాయిలకి తీసిపోని వాళ్ళున్నారు. రచనని పంపడం పొరపాటు. బుద్ధి గడ్డితిని మరో ఆలోచన లేకుండా పంపించాను. ఇరవై రూపాయలు కావా లంటే మారుమాట్లాడకుండా యిచ్చేశాను. స్వేచ్ఛ! స్వేచ్ఛ ఎవరికి? ఎంతవరకు? ఇంతవరకు యిలాంటి ఆలోచనలు నాకు రాలేదు

పది గంటలై పోయింది. ఈడొచ్చిన పిల్ల. రచనకి ఏం కాలేమకదా! రచన నలుగురితో స్నేహం చేస్తుంది. తెలివి తేటలతో, రూపంతో నలుగురినీ ఆకట్టుకుంటుంది. అయినా ముక్కుపచ్చలార నిది. లోకంపోకడ తెలియనిది. తెలిసీ తెలియని జ్ఞానం. ఎవరన్నా దాన్ని మోసం చేస్తే? ఆ కళ్ళజోడు కుర్రాడు 'దాన్ని' తీసుకుని ఎటన్నా పోయాడేమో! దానిచేత తాగించేడేమో! అన్నీ భయంకరమైన ఆలోచనలు!

ఎన్నడూ రాని కోపం చిత్రామీద వచ్చింది. తల్లి అన్న తర్వాత ఆడపిల్ల గురించి అందులో వయస్సు వస్తూన్న ఆడపిల్ల గురించి జాగ్రత్త తీసుకోవద్దూ? ఆ పిల మంచి చెడ్డలు చూడొద్దూ? రవి భజనలోపడి పదయేవరకూ ఇంటికి రాటం లేదని చింతపడుతోందే తప్ప రచన ఇంత వరకూ రాలేదేమని ఏకోశానా కంగారు పట్టంలేదు!

మా సావిట్లో ఎన్నెన్ని చర్చలు! ఎన్నెన్ని వాదనలు? సెక్సు గురించి! ప్రేమ గురించి! మా పిల్లల ముందరే మాట్లాడుకుంటాం. మా మిత్రులందరూ మమ్మల్నిద్దర్నీ తెగ అభినందిస్తారు. మేం పిలల్ని పెంచే తీరులో పిల్లల్ని పెంచాలి అని ఒప్పుకుంటారు. మెచ్చుకుంటారు. అప్పుడే సరియైన వికాసం వస్తుందని అంటారు. తాము అంత ముందడుగు వెయ్యలేకపోతున్నామని, తమ భార్యలు చిత్రా ఎదిగిన స్థాయికి ఎదిగినవారు కారని చెప్పుకుంటారు.

అంతా పొరపాటే! అదంతా పొరపాటే! చిత్రాకి ఏం తెలీదు! ఆడపిల్ల గురించి ఎలా జాగ్రత తీసుకోవాలో తెలీదు! రచన కేమైనా అయిందో ఏమో! ఎవరన్నా మోసం చేసేరోయేమో! నా వొంట్లో నెత్తురుని యెవరో పిండేసినట్టూ, పీల్చేసినట్టూ అనిపిస్తోంది.

భయానికీ. బెంగకీ, చలికీ పళ్ళు కొట్టుకుంటూవుంటే వొణికిపోతూ ఇంటికి వెళ్ళేను.

తలీ పిల్లలిద్దరూ భోజనాల టేబిలు దగర వున్నారు. టేబిలు చుటూ గొడవ గొడవగా. గోలగోలగా వుంది. నేరాకుండానే భోంచేసేసున్నారు! నా వొణుకు తగ్గింది, అమ్మయ్య! నా మొహంలోకి నెత్తురు వొచ్చింది!

రచన మొహం మతాబాలా వెలిగిపోతోంది. తనూ తన స్నేహితులూ యేమిటేమిటి చేసేరో ఏఏ విషయాలమీద వాదించుకున్నారో గడగడా చెప్తోంది! రవి మొహం ముడుచుకుని అన్నం తింటున్నాడు.

"ఏం రచనా! రావడం ఇంత లేట్ అయిందేం?" అడిగాను.

"దూరం ఉళ్ళ వాళ్ళని దిగబెట్టి టౌన్ లోకి బస్సు వచ్చేసరికి ఆలస్యం అయిపోయింది. ఆఖర్ని దిగింది నేనే! కొన యిల్లు మనదే!"

"కిళ్ళీకొట్టు వరకే అని పెద్ద రౌండ్ కొట్టి వచ్చేనే? ఇప్పుడే కూర్చున్నాం. నువ్వూ రారా" అంటూ చిత్రా నాకూ కంచం పెట్టింది.

"ఏరా! మూతి ములక్కాడలా పెట్టి తింటున్నావ్!" రవిని అడిగాను.

"ఏముందీ! టైం తగలెట్టుకోకూడదు. ఈ తిరుగుడు మంచిదికాదు అన్నాను అదీ సంగతి" అన్నది చిత్ర. ●

## ఔను నిజం !

సగటున మానవ దేహానికి దినసరి మూడు లీటర్ల నీరు కావాలి.

పళ్ల డాక్టర్లు చెబుతున్నారు
చిగుళ్ల బాధలు, దంతక్షయం అరికట్టడానికి,
నియమానుసారంగా పళ్లను బ్రష్ చేసుకొని,
చిగుళ్లను మాలిష్ చేసుకోవాలి.
ఫోర్‌హెన్స్ డబుల్ యాక్షన్
టూత్‌బ్రష్ వాడండి
మీ పళ్లను శుభ్రపరచడంతోపాటు చిగుళ్లను మాలిష్
కూడా చేయడానికి ప్రత్యేకంగా రూపొందించబడింది




పళ్లను బ్రష్ చేసుకోవడానికి, చిగుళ్లను మాలిష్ చేసుకోవడానికి ఫోర్‌హెన్స్ పద్ధతి నేర్చుకోండి. "పళ్లు, చిగుళ్లను గురించి తీసుకోవలసిన శ్రద్ధ" అనే రంగుల పుస్తకం ఉచితంగా కావాలంటే పోస్టు ఖర్చుకోసం 25 పైసల స్టాంపు జతపరుస్తూ, ఈ చిరునామాకు వ్రాయండి: ఫోర్‌హెన్స్ డెంటల్ అడ్వయిజరీ బ్యూరో, డిపార్ట్‌మెంట్ నెం. B46-219, పోస్టు బేగ్ 11468, బొంబాయి 400 020. ఏ భాషలో కావాలో వ్రాయండి.

ఫోర్‌హెన్స్ టూత్ బ్రష్‌లు
ఇంటిల్లిపాది కోసం
అడల్ట్ (మీడియం మరియు సాఫ్ట్) * జూనియర * బేబీ

Regd. T.M: Geoffrey Manners & Co. Ltd. 219F-152 TEL